నిహారిక కొణిదెల సమర్పణలో నూతన తారాగణంతో యదువంశీ దర్శకత్వంలో రూపొందించిన 'కమిటీ కుర్రోళ్లు' చిత్రం ఇటీవలే విడుదలైంది. తాజాగా ఈ సినిమాను అగ్ర నటుడు చిరంజీవి ప్రత్యేకంగా వీక్షించి, చిత్ర బృందాన్ని అభినందించారు. సినిమాలో భావోద్వేగాలు అద్భుతంగా పండాయని, కొత్తవారైనా నటీనటులందరూ చక్కగా పర్‌ఫార్మ్‌చేశారని, పరిమిత బడ్జెట్ మంచి క్వాలిటీతో సినిమా తీశారని చిరంజీవి చిత్ర యూనిట్ సభ్యులను ప్రశంసించారు.

లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో?

బాలీవుడ్ అగ్ర హీరోల్లో ఒకరైన అమీర్‌ఖాన్ గత కొంతకాలంగా వరుస ఫెయిల్యూర్స్‌తో సతమతమవుతున్నారు. భారీ విజయంతో తిరిగి ఫామ్‌లోకి రావాలనే లక్ష్యంతో ఉన్న ఆయన కొత్త చిత్రానికి సన్నాహాలు చేస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం తమిళ దర్శకుడు లోకేష్ కనకరాజ్ డైరెక్షన్‌లో అమీర్‌ఖాన్ ఓ సినిమా చేయబోతున్నారని తెలిసింది. పాన్ ఇండియా స్థాయిలో రూపొందించనున్న ఈ సినిమా నిర్మాణ బాధ్యతలను టాలీవుడ్ టాప్ ప్రొడక్షన్ హౌస్ మైత్రీ మూవీ మేకర్స్ చేపట్టనుందని సమాచారం. ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన ప్రాథమిక చర్చలు పూర్తయ్యాయని చెబుతున్నారు. అమీర్‌ఖాన్ గత చిత్రం 'లాల్‌సింగ్ చద్దా' బాక్సాఫీస్ వద్ద పరాజయం పాలైంది. లోకేష్ కనకరాజ్ ప్రస్తుతం రజనీకాంత్‌తో 'కూలీ' సినిమా చేస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ పూర్తయిన తర్వాత ఆయన అమీర్‌ఖాన్ చిత్రాన్ని డైరెక్ట్ చేస్తారని చెన్నై సినీ వర్గాల్లో వినిపిస్తున్నది. అమీర్‌ఖాన్-లోకేష్ కనకరాజ్ కాంబో కార్యరూపం దాల్చితే ఇండియన్ స్క్రీన్‌పై మరో బిగ్గెస్ట్ ఫిల్మ్‌కు రంగం సిద్ధమైనట్లేనని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి.



తల్వార్ మొదలైంది

యువహీరో ఆకాశ్ నటిస్తున్న యాక్షన్ ఎంటర్టైనర్ 'తల్వార్'. కాశీ పరశురామ్ దర్శకుడు. ఇ.ఎల్.వి.భాస్కర్ నిర్మాత. ఈ చిత్రం షూటింగ్ సోమవారం హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాలతో లాంఛనంగా మొదలైంది. ముహూర్తపు సన్నివేశానికి స్టార్ రైటర్ విజయేంద్రప్రసాద్ క్లాప్ ఇవ్వగా, డైరెక్టర్ కె.ఎస్.రవీంద్ర(బాబీ) కెమెరా స్విచాన్ చేశారు. హీరో కార్తికేయ స్క్రిప్ట్‌ని దర్శకుడికి అందజేశారు. 'ఉప్పెన'ఫేం బుచ్చిబాబు సాన తొలి సన్నివేశానికి దర్శకత్వం వహించారు. సినిమా బాగా రావాలని, మంచి విజయం సాధించాలని అతిథులందరూ ఆకాంక్షించారు. త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తామని, యాక్షన్ ఎంటర్టైనర్స్‌లో ఇదో వినూత్న ప్రయోగమని, మిగతా వివరాలు త్వరలో తెలియజేస్తామని దర్శకుడు చెప్పారు. ఈ చిత్రానికి కెమెరా: త్రిలోక్ సిద్ధు, సంగీతం: కేశవకిరణ్, నిర్మాణం: వార్నిక్ స్టూడియోస్.

రొట్టె విరిగి నెయ్యిలో పడింది

ప్రభాస్ పక్కన కథానాయికగా కొత్తమ్మాయి అనగానే, సోషల్‌మీడియా ఫోకస్ అంతా ప్రస్తుతం ఇమాన్వీ ఇస్మాయిల్ పైనే. అసలు ఈ అమ్మాయి ఎవరు? ఎక్కడ్నుంచొచ్చింది? అంటూ ఆరాలు మొదలయ్యాయి. ప్రభాస్ పుణ్యమా అని రాత్రికి రాత్రి ఈ అమ్మాయి స్టేటస్ మారిపోయింది. తన ఇన్‌స్టాలో ఏకంగా లక్షమంది ఫాలోవర్లు ఒక్కరోజులో పెరిగిపోయారు. శంఖంలో పోస్తేనే కదా తీర్థం అన్నట్టు, ప్రభాస్ పక్కన హీరోయిన్ అనగానే స్టార్ అయి కూర్చుంది ఇమాన్వీ. బడా నిర్మాతలంతా ప్రభాస్ సినిమా తర్వాత తమ సినిమాల్లో ఈ అమ్మాయిని నటింపజేయడానికి అప్పుడే ప్రయత్నాలు ముమ్మరం చేశారట. అయితే.. మైత్రీ మూవీమేకర్స్ వాళ్లు మాత్రం తమ సంస్థలో ముందు మూడు సినిమాలు చేసేంతవరకూ ఇతర సినిమాలు ఒప్పుకోకూడదని కండీషన్ పెట్టారట ఈ ముద్దుగుమ్మకు. అంతే కాదు, దర్శకుడు అను రాఘవపూడి కూడా తన సినిమా పూర్తయ్యేంత వరకూ మరో సినిమా చేయడానికి వీల్లేదని షరతు విధించారట. ప్రభాస్‌తో ఆయన చేసే సినిమాకు కథానాయిక ఎవరైనా సరే, బల్క్ డేట్లు తనకు అవసరమట. పిలిచినప్పుడల్లా సెట్‌కి రావాల్సి ఉంటుందట. అందుకే బిజీ కథానాయికలను పక్కనపెట్టి ఇమాన్వీని తీసుకున్నారట అను రాఘవపూడి. ఏదేమైనా ఈ అందాలభామ రొట్టె విరిగి నేతిలో పడిందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

దసరా బరిలో 'వేట్టైయాన్'

అగ్ర కథానాయకుడు రజనీకాంత్ నటిస్తున్న తాజా చిత్రం 'వేట్టైయాన్'. 'జై భీమ్' ఫేమ్ టీజే జ్ఞానవేల్ దర్శకత్వం వహిస్తున్నారు. లైకా ప్రొడక్షన్స్ సంస్థ నిర్మిస్తున్నది. ఈ సినిమాలో బిగ్‌బి అమితాబ్ బచ్చన్ కీలక పాత్రను పోషిస్తున్నారు. చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ చిత్రాన్ని దసరా కానుకగా అక్టోబర్ 10న విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ ప్రకటించారు. దర్శకుడు టీజే జ్ఞానవేల్ గత చిత్రాల తరహాలోనే చక్కటి సామాజిక సందేశం కలబోసిన కథాంశమిదని, ఇందులో రజనీకాంత్ పవర్‌ఫుల్ పోలీస్ పాత్రలో కనిపిస్తారని, దుష్టశిక్షణ కోసం ఆయన ఏం చేశారన్నది ఆద్యంతం ఉత్కంఠభరితంగా ఉంటుందని చిత్ర బృందం పేర్కొంది. ఈ చిత్రంలో ఫహాద్ ఫాజిల్, రానా, మంజు వారియర్, రితికాసింగ్, దుషరా విజయన్, రోహిణి తదితరులు నటిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: అనిరుధ్, నిర్మాత: సుభాస్కరన్.

పని దొరుకుతుంది కాబట్టే చేస్తున్నా



కొందరు బతకడం కోసం పనిచేస్తారు. కొందరు పనిచేయడం కోసమే బతుకుతారు. రెండో రకానికి చెందిన వ్యక్తి బిగ్‌బీ అమితాబ్. 81ఏళ్ల వయసులో తను చేయడానికి పని దొరుకుతున్నందుకు ఆనందిస్తున్నారాయన. ఈ వయసులో ఇంకా బిజీగా పనిచేస్తుండటంపై తాజాగా తన బ్లాగ్‌లో స్పందించారు అమితాబ్. 'మీకు వయసు అయిపోయింది. ఈ వయసులో కూడా అతిగా పనిచేయడం అవసరమా? రెస్ట్ తీసుకోవచ్చుకదా! అని చాలామంది నాకు సలహా లిస్తూ ఉంటారు. వారికి చెప్పేదొక్కటే. ఇప్పటికీ పని చేస్తున్నానంటే కారణం.. నాకు పని దొరకడమే. అంతకంటే వేరే కారణం ఏమీలేదు. పని దొరుకుతుంది కాబట్టే చేస్తున్నా. మరి నా పని మీకేమైనా సమస్యగా ఉందా? లేదు అనుకుంటే, వెళ్లి మీ పని మీరు చూసుకోండి. నేనెందుకు పని చేస్తున్నానో అర్థమవుతుంది.' అంటూ చెప్పుకొచ్చారు బిగ్‌బీ. ఆయన కామెంట్స్ ప్రస్తుతం బాగా వైరల్ అవుతున్నాయి.

పెళ్లి చేసుకుంటాడు.. పిల్లలొద్దంటాడు!

'ఓ మిడిల్‌క్లాస్ అబ్బాయి.. తనకొచ్చే జీతంలో హ్యాపీగా ఉంటాడు. పెళ్లి చేసుకుంటాడు. పిల్లలు వద్దంటాడు. ఎందుకంటే.. పిల్లలు పుడితే ఎదురయ్యే ఖర్చులు చెప్పి అడిగినవాళ్ల నోళ్లు మూయిస్తాడు. ఈ కేరక్టరైజేషనే నన్ను కట్టిపడేసింది. ఈ రోజుల్లో డబ్బు అవసరమే. అలాగే ఎమోషన్స్ కూడా అవసరం. డైరెక్టర్ సందీప్ తన రియల్‌లైఫ్‌లో చూసిన ఇన్సిడెన్స్‌ని బేస్ చేసుకుని ఈ కథ రాసుకున్నాడు. దీన్ని హ్యూమరస్‌గా, మంచి కాన్సెప్ట్‌తో తయారు చేశాడు. సినిమా చూశాను. చాలా రోజుల తర్వాత మంచి సినిమా చూసిన అనుభూతి కలిగింది. సెప్టెంబర్ 7న విడుదల చేస్తున్నాం. కమిటీకుర్రోళ్లు, ఆయ్ సినిమాల విషయంలో ప్రేక్షకులు ఎలాగైతే ఫ్రెష్‌గా ఫీలవుతున్నారో ఈ సినిమాను కూడా అలాగే ఫీలవుతారు. మిడిల్‌క్లాస్ అబ్బాయిగా సుహాస్ చక్కగా నటించాడు.' అని దిల్ రాజు అన్నారు. దిల్‌రాజు ప్రొడక్షన్స్ పతాకంపై రూపొందిన తాజా చిత్రం 'జనక అయితే గనక'. సుహాస్, సంగీర్తన జంటగా నటించారు. సుధీర్‌రెడ్డి బండ్ల దర్శకుడు. సెప్టెంబర్ 7న సినిమా విడుదల కానుంది. సోమవారం హీరో సుహాస్ పుట్టిన రోజు సందర్భంగా ఈ సినిమాలోని 'నా ఫేవరేట్ పెళ్లాం' సాంగ్‌ని హైదరాబాద్‌లో లాంచ్ చేశారు. ఈ కార్యక్రమంలో దిల్‌రాజు మాట్లాడారు. దర్శకుడు సందీప్ మరిచిపోలేని సినిమా ఇచ్చాడని, దిల్ రాజుగారికి పెద్ద థ్యాంక్సని సుహాస్ అన్నారు. ఇంకా చిత్ర యూనిట్ మొత్తం మాట్లాడారు.

తాతామనవళ్ల కామెడీ కొట్లాట..

బ్రహ్మానందం, ఆయన తనయుడు రాజా గౌతమ్ తాతా మనవళ్లుగా నటిస్తున్న చిత్రం 'బ్రహ్మ ఆనందం'. ఆర్వీఎస్ నిఖిల్ దర్శకత్వంలో రాహుల్ యాదవ్ నక్కా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రక్షాబంధన్‌ను పురస్కరించుకుని ఈ సినిమా ఫస్ట్ గ్లింప్స్‌ని మేకర్స్ విడుదల చేశారు. రాజా గౌతమ్ పాత్ర పరిచయంతో ఈ గ్లింప్స్ మొదలైంది. అవసరాలు తీరక ఇబ్బందులు పడుతున్న హోప్‌లెస్ యువకుడిగా రాజా గౌతమ్, అతని స్నేహితుడిగా వెన్నెలకిశోర్ ఈ గ్లింప్స్‌లో కనిపిస్తున్నారు. బ్రహ్మానందం ఎంట్రన్స్‌తో గ్లింప్స్ మరింత ఇంట్రస్టింగ్‌గా మారింది. స్వధర్మ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై రూపొందిన మళ్లీరావా, ఏజెంట్ సాయిశ్రీనివాస ఆత్రేయ, మసూద చిత్రాలు మంచి సక్సెస్‌లు అందుకున్నాయి. దీంతో ఈ సినిమాపై కూడా అంచనాలు భారీగా ఉన్నాయని మేకర్స్ తెలిపారు. ప్రియా వడ్లమాని, ఐశ్వర్య హులక్కల్ కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రంలో వెన్నెల కిశోర్, సంపత్, రాజీవ్ కనకాల కీలక పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: మితేష్ పర్వతనేని, సంగీతం: శాండిల్య పిసపాటి.

ఏ అలుపూ సొలుపు లేని విహారం..

కిరణ్ అబ్బవరం నటిస్తున్న పిరియాడిక్ థ్రిల్లర్ 'క'. సుజీత్, సందీప్ కలిసి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. చింతా గోపాలకృష్ణారెడ్డి నిర్మాత. త్వరలో పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రం విడుదలకానుంది. ప్రమోషన్‌లో భాగంగా ఈ సినిమాలోని తొలిపాటను మేకర్స్ విడుదల చేశారు. 'వరల్డ్ ఆఫ్ వాసుదేవ్..' అంటూ సాగే ఈ పాటను సేనాపతి భరద్వాజ్ పాత్రుడు రాయగా, సామ్ పీఎస్ స్వరపరిచారు. కపిల్ కపిలన్ ఆలపించారు. మీరో పాత్రచిత్రణకు అద్దం పట్టేలా ఈ పాట సాగిందని మేకర్స్ తెలిపారు. 'ఏ మొదలు తుదలు లేని ప్రయాణం.. ఏ అలుపూ సొలుపు లేని విహారం.. ఏ చెరలు తెరలు తెలియని పాదం.. ఈ మజిలీ ఒడిలో ఒదిగిన వైనం..' అంటూ అర్థవంతమైన సాహిత్యాన్ని ఈ పాటలో వినొచ్చు. నయన్ సారిక, తన్వీరామ్ కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: విశ్వాస్ డానియేల్, సతీశ్‌రెడ్డి మాసం, సమర్పణ: చింతా వరలక్ష్మీ, నిర్మాణం: శ్రీచక్రాస్ ఎంటర్టైన్మెంట్స్.

కావాల్సినన్ని నవ్వులు పంచుతా

'దర్శకుడు లక్ష్మణ్ కార్య నన్ను ఇన్‌స్టాలో చూసి పిలిపించారు. ఆఫీస్‌కి వెళ్లాక ఆడిషన్స్ చేశారు. నా నటన నచ్చడంతో హీరోయిన్‌గా ఎంపిక చేశారు. ఇందులో నా పాత్ర ఆడియన్స్‌కి కావాల్సినంత నవ్వులు పంచుతుంది. నిజానికి నవ్వించడం కష్టం. నవ్వించగలిగామంటే నటిగా సక్సెస్ అయినట్టే. అందుకే కాస్త కష్టమైనా ఇష్టంగా ఈ పాత్ర చేశా. ' అని రమ్య పసుపులేటి అన్నారు. రావురమేశ్ హీరోగా రూపొందిన చిత్రం 'మారుతీనగర్ సుబ్రమణ్యం'. ఇందులో రావురమేశ్ కొడుకుగా నటించిన అంకిత్ కొయ్యకు జోడీగా రమ్య నటించింది. లక్ష్మణ్ కార్య దర్శకత్వంలో బుజ్జి రాయుడు పెంట్యాల, మోహన్ కార్య కలిసి నిర్మిస్తున్న ఈ చిత్రం ఈ నెల 23న విడుదల కానుంది. ఈ సందర్భంగా సోమవారం రమ్య విలేకరులతో ముచ్చటించింది. 'ఇందులో నేను పద్దెనిమిదేండ్ల అమ్మాయిగా నటించా. క్యూట్ లవ్ స్టోరీ కూడా ఉంటుంది. కథ రీత్యా గ్లామరస్, ట్రెడిషనల్‌గా రెండు రకాలుగా కనిపిస్తా.' అని చెప్పుకొచ్చింది రమ్య. సిద్ శ్రీరామ్ పాడిన 'మేడమ్ సార్ మేడమ్..' పాటకు మంచి స్పందన వస్తున్నదని, అంకిత్ కొయ్య మంచి నటుడు, వెరీ అమేజింగ్ కోయాక్టర్ అని, రావురమేశ్, ఇంద్రజ లాంటి సీనియర్స్‌తో కలిసి నటించడం గొప్ప అనుభవమని రమ్య పేర్కొన్నారు.

అమ్మాయిలకు ఆమడదూరం

రాజ్ తరుణ్ తాజా సినిమా 'భలే ఉన్నాడే'. మనీషా కంద్కూర్ కథానాయిక. వర్ధన్ దర్శకుడు. ఎన్‌వీ కిరణ్‌కుమార్ నిర్మాత. అగ్ర దర్శకుడు మారుతి సమర్పకుడు. సెప్టెంబర్ 7న సినిమా విడుదల కానుంది. ప్రమోషన్‌లో భాగంగా ఈ సినిమా ట్రైలర్‌ని మేకర్స్ విడుదల చేశారు. అమ్మాయిలంటే ఆమడ దూరంలో వుండే హీరో పాత్రని ఈ ట్రైలర్‌లో పరిచయం చేశారు. ఫన్‌గా, ఎమోషనల్‌గా ట్రైలర్ సాగింది. టీవీ గణేశ్, హైపర్ ఆది, కృష్ణభగవాన్ శ్రీకాంత్ అయ్యంగార్ ట్రైలర్‌లో వినోదాన్ని పంచారు. హీరోహీరోయిన్ల మధ్య వచ్చే ప్రేమ సన్నివేశాలు వినోదాత్మకంగా ఉంటాయని మేకర్స్ తెలిపారు. సింగీతం శ్రీనివాస్, అభిరామి, గోపరాజు రమణ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: నగేశ్ బానెల్లా, సంగీతం: శేఖర్‌చంద్ర.

భద్రగణం వారసులు

మంచు విష్ణు కథానాయకుడిగా నటిస్తున్న భక్తిరస ప్రధాన చిత్రం 'కన్నప్ప'. శ్రీకాళహస్తిశ్వర స్థలపురాణం ఆధారంగా తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాలో మోహన్‌లాల్, శరత్‌కుమార్, అక్షయ్ కుమార్, మోహన్‌బాబు, ప్రభాస్ వంటి అగ్ర తారలు భాగమవుతున్నారు. డిసెంబర్‌లో పాన్ ఇండియా స్థాయిలో ప్రేక్షకుల ముందుకురానుంది. తాజాగా ఈ చిత్రంలో ముఖేష్‌రుషి, బ్రహ్మాజీ పాత్రలకు సంబంధించిన ఫస్ట్‌లుక్ పోస్టర్స్‌ను సోమవారం విడుదల చేశారు. ఇందులో కంపడు పాత్రలో ముఖేష్ రుషి, గవ్వరాజుగా బ్రహ్మాజీ కనిపించనున్నారు. పురాతమైన పుళిందుల తెగకు చెందిన వీరిని భద్రగణం అని కూడా పిలుస్తారు. వాయిలింగానికి వంశపారంపర్యంగా సేవలు చేస్తు భద్రగణాన్ని నడిపిస్తుంటారని, వీరి పాత్రలకు కథాగమనంలో చాలా ప్రాధాన్యత ఉంటుందని చిత్ర బృందం పేర్కొంది. ఈ చిత్రానికి ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నారు.

ఎనిమిది వసంతాలు

'మ్యాడ్' ఫేమ్ అనంతిక సనీల్‌కుమార్ నటిస్తున్న తాజా చిత్రం '8వసంతాలు'. ఫణీంద్ర నర్సెట్టి దర్శకుడు. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తున్నది. ఈ సినిమా షూటింగ్ పూర్తికావొస్తున్నదని, వినూత్నమైన కాన్సెప్ట్‌తో రూపొందిస్తున్నామని మేకర్స్ తెలిపారు. 'కొద్దిరోజుల క్రితం విడుదల చేసిన ఫస్ట్‌లుక్ పోస్టర్ ప్రేక్షకుల్లో ఆసక్తినిరేకెత్తించింది. హైదరాబాద్, ఊటీ, కన్యాకుమారి ప్రాంతాల్లో చిత్రీకరణ జరిపాం. తదుపరి షెడ్యూల్‌ను కశ్మీర్, ఆగ్రా, వారణాసిలో జరుపబోతున్నాం' అని చిత్రబృందం పేర్కొంది. హనురెడ్డి, రవితేజ దుగ్గిరాల, సంజన తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: హేషమ్ అబ్దుల్ వహాబ్, నిర్మాతలు: నవీన్ యెర్నేని, వై.రవిశంకర్, రచన-దర్శకత్వం: ఫణీంద్ర నర్సెట్టి.